# సాక్షి
## కామారెడ్డి

శుక్రవారం । 28 । మార్చి । 2025







**నిర్మాణాలు పూర్తి చేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో చందర్ నాయక్ ఆదేశించారు.

- IIలో ▸




**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 38.6 /20.0

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

# వడ్డీకాసురులపై నజర్!

కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో నివసించే విఠల్ అనే చిరు వ్యాపారి ఓ ఫైనాన్స్ సంస్థలో రూ. 6 లక్షలు అప్పు తీసుకన్నాడు. సగానికిపైగా వాయిదాలు సక్రమంగానే చెల్లించాడు. వాయిదాలు దగ్గరపడుతున్న సమయంలో వ్యాపారం సరిగ్గా నడవక కొన్నింటిని వాయిదా వేశాడు. సదరు ఫైనాన్స్ సంస్థ అధిక వడ్డీలు వేస్తూ అప్పు కట్టాలని వేధించడం మొదలుపెట్టింది. సమయం ఇవ్వకపోవడం, వేధింపులు పెరగడంతో విఠల్ తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో వారం క్రితం గుండెపోటుకు గురై మృతి చెందాడు.

బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ గౌడ్ (32) అనే యువకుడు ఓ ఫైనాన్స్ సంస్థలో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. వాయిదాలు చెల్లించడంలో ఇబ్బందులు పెరిగి జీవితంపై విరక్తి చెందిన అతడు.. రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలో ప్రైవేట్ ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి, అడ్డగోలు వడ్డీలు చెల్లించలేక చాలామంది ఇబ్బంది పడుతున్నారు.




**వడ్డీ వ్యాపారుల ఆగడాలు పెరిగాయి.** ఎదుటివారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని అప్పులిస్తూ.. ఆపై ఇష్టారాజ్యంగా వడ్డీలు వసూలు చేస్తున్నారు. వాయిదాలు చెల్లించకపోతే వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో జిల్లా పోలీసులు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు. గురువారం జిల్లావ్యాప్తంగా 69 చోట్ల తనిఖీలు చేపట్టడమే కాకుండా 17 కేసులు కూడా నమోదు చేశారు.

– కామారెడి క్రైం

- ఫైనాన్స్‌లపై దాడులు చేస్తున్న జిల్లా పోలీసుశాఖ
- అనుమతులు లేకుండా నడిపితే చర్యలు తప్పవని హెచ్చరిక

జిల్లాలో ఫైనాన్స్ వ్యాపారం ఇష్టారాజ్యంగా నడుస్తోంది. వడ్డీల మీద వడ్డీలు వేస్తూ జనాన్ని పీక్కుతినే వ్యాపారులు చాలామంది ఉన్నారు. నిబంధనల ప్రకారం వంద రూపాయలకు రూ.2 కు మించి వడ్డీ తీసుకోకూడదు. వ్యాపారం చేసే వారు అధికారుల నుంచి అనుమతి పొందాలి. లెక్కలు పక్కాగా నిర్వహించాలి. అన్ని నిబంధనలు పాటిస్తూ ఫైనాన్స్ వ్యాపారం నడపాల్సి ఉంటుంది. అయితే చాలామంది నిబంధనలు గాలికి వదిలేసి ధనార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అవసరం ఉన్నప్పుడు అప్పు తీసుకుని ఆ తర్వాత అధిక వడ్డీలు కట్టలేక చాలామంది అవస్థలు పడుతున్నారు. కొందరు వ్యాపారులైతే ఏకంగా ఆస్తి పత్రాలు తనఖా పెట్టుకుని అప్పులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. రూ. 3 నుంచి రూ. 6 వరకు వడ్డీ వసూలు చేసే వారూ ఉన్నా రు. ఇలా అధిక వడ్డీలకు అప్పులు తీసుకున్నవారు పరిస్థితులు బాగాలేక వాయిదాలు చెల్లించలేక తనఖా పెట్టిన ఆస్తులను పోగొట్టుకుని బాధితులుగా మిగిలిపోతున్నారు.

### అడ్డుకట్ట పడేనా?

అనుమతులు లేకుండానే వ్యాపారాలు చేస్తున్న వారి పై, నిబంధనలకు విరు ద్ధంగా వడ్డీలు వసూ లు చేస్తూ సామాన్యు ల నడ్డి విరుస్తున్న వారిపై జిల్లా పోలీసు శాఖ మరోసారి దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా దాడులు చేస్తున్నారు. అన్ని రకాల ఫైనాన్స్‌లలో తనిఖీలు నిర్వహిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్న తీరును పరిశీలిస్తున్నారు. ఇకపై కూడా తనిఖీలు నిరంతరంగా చేపడతామని పోలీసు అధికారులు చెబుతుండడంతో అడ్డగోలు వడ్డీ దందాలకు అడ్డుకట్ట పడుతుందని ఆశిస్తున్నారు.

### సహించేది లేదు..



జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు మా దృష్టికి వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహించినా, వడ్డీలు వసూలు చేసినా సహించేది లేదు. అనుమతులు లేకుండా ఫైనాన్స్ లు నిర్వహిస్తూ అధిక వడ్డీలు వసూలు చేసినా కేసులు తప్పవు. జిల్లాలో తనిఖీలు ఇంకా కొనసాగుతాయి.

– రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

# సెర్ప్ లక్ష్యాల సాధనకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సెర్ప్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ సూచించారు. గురువారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో మాట్లాడారు. యాసంగిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను గణనీయంగా పెంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి మహిళా సంఘాలకు రావాల్సిన కమీషన్‌పై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న కమీషన్ చెల్లించేలా చూడాలని సూచించారు. స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ప్ సమన్వయంతో ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు.

**స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలి..**

కలెక్టర్‌లు ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్నవారు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలన్నారు. డీఆర్డీవో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసులను సత్వరం పరిష్కరించాలని సూచించారు. స్వశక్తి సంఘాలకు చెల్లించాల్సిన యూనిఫాంలకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ వరకల్లా జిల్లా సమైక్య భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, మొదట జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు.

### జిల్లాలో 156 కేంద్రాలు..

జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో గతంలో 27 కొనుగోలు కేంద్రాలను నిర్వహించగా.. ఈసారి వాటి సంఖ్య 156కు పెంచామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కావలసిన సామగ్రిని సమకూర్చాలని అధికారులకు సూచించారు. పెట్రోల్ బంక్‌ల ఏర్పాటునకు అనువైన భూములను గుర్తించాలని రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించారు. ముందుగా ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. సదరం క్యాంపుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీవో సురేందర్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సాక్షి కవితలకు ఆహ్వానం..

తెలుగు ప్రజల నూతన సంవత్సరాది ఉగాది. ఈ పండగకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఉగాది ప్రాశస్త్యాన్ని వివరిస్తూ 'సాక్షి' కవితలను ఆహ్వానిస్తోంది. 10 లైన్లకు మించకుండా మీ కవితను పంపండి. మీ ఫొటోను జత చేయండి. ఎంపిక చేసిన కవితలను ఉగాది రోజున ప్రచురిస్తాం..

పంపించాల్సిన వాట్సాప్ నంబర్ :
**95539 55625**

## న్యూస్‌రీల్

### 'దోషులు ఎవరైనా ఉపేక్షించం'



నిజాంసాగర్: పదోతరగతి గణితం ప్రశ్నలు బయటకు వచ్చిన ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, దోషులు ఎవరైనా ఉపేక్షించబోమని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో ఫోన్ ద్వారా మాట్లాడారు. జుక్కల్ జెడ్పీహెచ్ఎస్‌లోని పరీక్ష కేంద్రంనుంచి గణితం పేపర్‌లోని ప్రశ్నలు ఓ చిట్టీ ద్వారా బయటపడిన విషయం తెలియగానే విద్యాశాఖ అధికారులతోపాటు బాన్సువాడ సబ్‌కలెక్టర్‌ను, పోలీస్ అధికారులను అప్రమత్తం చేశానన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. మరింత అప్రమత్తంగా ఉండాలని, పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా సాగేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

### 'వినూత్న పద్ధతులు అవలంబించాలి'



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కామారెడ్డి టౌన్: చేపల పెంపకంలో వినూత్న పద్ధతులు అవలంబించాలని కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ సూచించారు. గురువారం కళాశాలలో జువాలజీ, ఫిషరీస్ విభాగాల ఆధ్వర్యంలో 'ఆధునిక, సమర్థవంతమైన చేపల పెంపకం విధానం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా ఆర్థిక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్క్ సొల్యూషన్ ముర్రెల్ ఫిష్ ఇండస్ట్రీ రిసోర్స్ పర్సన్ మాధవి, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త జయప్రకాష్, వృక్షశాస్త్ర శాఖాధిపతి దినకర్, హిందీ శాఖాధిపతి శ్రీనివాసరావు, అధ్యాపకులు ఫర్హీన్ ఫాతిమా, మానస, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలోని మైనారిటీ, ఎస్సీలు వచ్చేనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన పథకాలకు 21 నుంచి 60 ఏళ్ల లోపు వారు, ఇతర పథకాలకు 21 నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు.

### రేపు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల 20 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు పురుషులు 76719 74009 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2020–24 బ్యాచ్ డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును విద్యార్థుల వినతి మేరకు ఏప్రిల్ 7వరకు పొడిగించినట్లు కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు (ఏప్రిల్, మే 2025లో) హాజరయ్యే విద్యార్థులకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఏప్రిల్ 8వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# ప్రాణం తీసిన కారు పంచాయితీ!



రమేశ్ (ఫైల్)

దోమకొండ: ఒక కారు ఇన్‌స్టాల్‌మెంట్‌ల విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న పంచాయితీ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ముత్యంపేట గ్రామానికి చెందిన ఈరబోయిన రమేశ్(35) కొంత కాలం క్రితం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇటుకబట్టి నిర్వాహకుడు పల్లె పోశయ్యకు తన కారును విక్రయించాడు. కారుకు సంబంధించిన ఇన్‌స్టాల్‌మెంట్‌ల చెల్లింపు విషయంలో ఇద్దరి మధ్య ఒప్పందం జరిగింది. అయితే పల్లె పోశయ్య ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు చెల్లించకపోవడంతో లోన్ ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు రమేశ్‌కు ఫోన్ చేసి డబ్బులు కట్టాలని అడుగుతున్నారు. దీంతో బుధవారం సాయంత్రం ఈ విషయమై రమేశ్, పోశయ్యల మధ్య వాగ్వాదం జరిగింది. తన కారు తాను తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్న రమేశ్.. గురువారం తెల్లవారుజామున చింతమాన్‌పల్లి శివారులోని ఇటుకబట్టి వద్దకు వెళ్లి రెండో కీతో కారును స్టార్ట్ చేశాడు. దీనిని గమనించిన పల్లె పోశయ్య, ఇటుక బట్టి కూలీలు రమేశ్‌ను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కారు ముందుకు కదలడంతో పోశయ్య కాలుకు గాయమైంది. దీంతో ఆగ్రహించిన కూలీలు రమేశ్‌పై కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న రమేశ్ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చారు. రమేశ్‌ను ఆటోలో కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, దోమకొండ ఎస్సై ప్రవంతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మృతుడు రమేశ్ గ్రామంలో గోపాలమిత్రగా పనిచేసేవాడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

## 'నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం'

కామారెడ్డి క్రైం: నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంను ఆయన గురువారం పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తదితర అంశాలను కంట్రోల్ రూం ద్వారా పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని ప్రజలకు హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్పీ నరసింహారెడ్డి ఉన్నారు.



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

# లక్ష్యం చేరితేనే నిధులు

- ఇంటి పన్ను వసూళ్లకు, ఆర్థిక సంఘం నిధులకు లింక్
- బాన్సువాడ బల్దియాలో వసూలు చేయాల్సిన పన్నులు రూ. 4.50 కోట్లు
- ఇప్పటివరకు వసూలైంది రూ. 2.71 కోట్లే..

**ప్రజలు చెల్లించే పన్నులతోపాటు** ఆర్థిక సంఘం నిధులే పట్టణాలకు ఆధారం. అయితే ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకుంటేనే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయి. మరోవైపు ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తున్నా ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం సుదూరంగానే ఉంది. రకరకాల కారణాలతో ఆస్తి హక్కుదారులు పన్నులు చెల్లించకుండా మొండికేస్తుండడంతో ఆ పన్నులెలా వసూలు చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



బాన్సువాడలో పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బాన్సువాడ : మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్నులే.. ఇంటి పన్నుల ద్వారానే అధిక మొత్తంలో ఆదాయం సమకూరుతుంది. బాన్సువాడ మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.50 కోట్ల మేర పన్నులు వసూలు చేయాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు రూ.2.71 కోట్లు మాత్రమే పన్నులు వసూలయ్యాయి. ఇంకా రూ.1.80 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా నాలుగు రోజులే ఉన్నాయి. ఇందులో ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగలు రావడంతో మిగిలిన రెండురోజులే గడువు మిగిలి ఉన్నట్లు.. ఆర్థిక సంవత్సరం చివరికి వచ్చినా పన్నుల వసూళ్లపై దృష్టి సారించకపోవడంతో వంద శాతం పన్నుల వసూలు అసాధ్యంగా కనిపిస్తోంది.

**మరో రూ. 36 లక్షలు వసూలైతే..**

మున్సిపాలిటీల్లో లక్ష్యం మేరకు పన్నులు వసూలైతేనే 15 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది వసూలు చేసిన మొత్తం కంటే పది శాతం అదనంగా వసూలు చేస్తేనే ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. ఈ లక్ష్యాన్ని చేరుకుంటే ఆర్థిక సంఘం నిధులు రూ. 2 కోట్ల మేర వస్తాయన్న ఆశతో అధికారులున్నారు. అయితే ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో రూ. 36 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. రెండు రోజుల్లో ఇంతమొత్తాన్ని వసూలు చేయడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్థిక సంఘం నిధులు రాకపోతే అభివృద్ధి కుంటుపడే అవకాశాలున్నాయి.

### రాజకీయ ఒత్తిళ్లతో అడ్డంకులు

బాన్సువాడ మున్సిపాలిటీలో ఇళ్లకు సంబంధించిన పన్నుల వసూలు బాగానే ఉన్నా.. కమర్షియల్ భవనాలకు సంబంధించి వసూళ్లు ఆశించిన మేర జరగడం లేదు. చాలా మంది కొన్నేళ్లుగా పన్నులు కట్టకుండా ఉండడం, రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. అయితే ప్రస్తుతం అధికారులపై కూడా పన్నుల వసూలు చేయాలని ఒత్తిళ్లు వస్తుండడంతో కమర్షియల్ భవనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉన్న ఫంక్షన్ హాళ్లు, ఇతర షట్టర్లకు నోటీసులు ఇచ్చారు. వారి ప్రయత్నాలు ఎంతమేరకు ఫలితాలిస్తాయో చూడాలి.

### వంద శాతం వసూలు చేస్తాం

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 67.57 శాతం పన్నులు వసూలు చేశాం. మిగతా లక్ష్యాన్ని చేరుకునేందుకు మా సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ పన్నులు వసూలు చేసి, ఆర్థిక సంఘం నిధులు సాధిస్తాం.

– శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

# చిన్నారులను ఆకట్టుకునేలా..

- అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య
- 9 అంశాల ద్వారా విద్యాబోధన

ఎల్లారెడ్డిరూరల్: పిండి కేంద్రాలు అని పిలిచే ఒకప్పటి అంగన్‌వాడీ కేంద్రాలు.. ఇప్పుడు పూర్వ ప్రాథమిక విద్యను అందించే పాఠశాలల స్థాయికి ఎదిగాయి. పౌష్టికాహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తుండడంతో ఆయా కేంద్రాలకు రావడానికి చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తోంది. ప్రస్తుతం మండలానికి ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి వాటిలో పెయింటింగ్ వేసి రంగుల ప్రపంచంగా తీర్చిదిద్దారు.



అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులు






కట్టకింది తండా అంగన్‌వాడీ కేంద్రం గోడలపై వేసిన చిత్రాలు

ఎల్లారెడ్డి మండలంలోని కట్టకిందితండా, నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్–2, గాంధారి మండలంలోని ముదోలి, లింగంపేట మండలంలోని పోతాయిపల్లి గ్రామాలలోగల అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడి కేంద్రాలలో పెయింటింగ్ ద్వారా ఫ్రూట్స్, వెజిటబుల్స్, అల్ఫాబెట్స్, కార్టూన్స్, ఆనిమల్స్, మ్యాథ్స్‌కు సంబంధించిన చిత్రాలను వేయించారు. దీంతో చిన్నారులు ఆ చిత్రాలకు ఆకర్షితులై చదువుపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వీటితో పాటు 9 అంశాలలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. ఆటలు, పాటలు, కథలు, సంభాషణ, మంచి అలవాట్లు, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం, భాషా పరిచయం అంశాల ఆధారంగా విద్యను బోధిస్తున్నారు. అంకెలను గుర్తు పట్టడం, చదవడం, రాసే పద్ధతులను నేర్పుతున్నారు. జిగ్‌జాగ్ డ్రాయింగ్ ద్వారా అక్షరాలను రాసే విధానం నేర్పిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీలకు రావడానికి పిల్లలు ఇష్టపడుతున్నారని వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### ఆసక్తిగా వస్తున్నారు

పాఠశాలలో వేసిన చిత్రాలకు చిన్నారులు ఆకర్షితులవుతున్నారు. రెగ్యులర్‌గా అంగన్‌వాడీకి వస్తున్నారు. ఇక్కడి గోడలపై ఉన్న చిత్రాలను చూసి ఇంటికి వెళ్లాక కూరగాయలు, పండ్లను గుర్తుపడుతుండడంతో వారి తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు.

– మీరి, అంగన్‌వాడీ టీచర్, కట్టకింది తండా

## క్లుప్తంగా

### రసవత్తరంగా కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని బోనాల్ గ్రామంలోని ప్రభుస్వామి ఆలయం వద్ద గురువారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి రెండు తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన కుస్తీ వీరులకు నగదు బహుమతులు అందజేశారు. చివరి కుస్తీ 2 తులాల వెండి కడెం గెలుపొందిన విజేతకు బహుకరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

### 'యువ వికాసం' సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**కామారెడ్డి టౌన్:** రాజీవ్ యువ వికాసం పథకంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని బీసీ, గిరిజన విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షులు నాగరాజు, వినోద్‌నాయక్‌కు గురువారం అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇతర పథకాల్లో లబ్ధి పొందని వారు దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో అనర్హుడిగా గుర్తిస్తూ తిరస్కరణకు గురవుతున్నాయని తెలిపారు. దీంతో నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారన్నారు. తక్షణమే సమస్యను పరిస్కరించాలని కోరారు.

### పాఠశాలలో సమగ్ర శిక్ష కార్యక్రమం


పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**బీబీపేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సమగ్ర శిక్ష ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల సముదాయంలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉప్పర్ పల్లి, ఇస్సానగర్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. మండల విద్యాధికారి అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, యూపీఎస్ పాఠశాలల హెచ్‌ఎంలు రాఘవరెడ్డి, పద్మిని, పాఠశాల ఉపాధ్యాయులు విశ్వమోహన్, రాము,అరుంధతి, స్వామి, నాగరాజు, నవీన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- సీసీ పనులు నాణ్యతతో చేపట్టాలి
- జెడ్పీ సీఈవో చందర్ నాయక్

**నిజాంసాగర్/బాన్సువాడ రూరల్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి చందర్‌నాయక్ అన్నారు. గురువారం జుక్కల్ మండలం బంగారుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. ఇళ్ల స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో జెడ్పీసీఈవో చందర్‌నాయక్ పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులు ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని సూచించారు. అలాగే గ్రామంలో కొనసాగుతున్న సీసీరోడ్ల పనులు పరిశీలించి నాణ్యతతో చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో బషీరుద్దీన్, జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శి నవీన్‌గౌడ్ తదితరులున్నారు.


బంగారుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో చందర్‌నాయక్

**నిజాంసాగర్ (జుక్కల్):** మండలంలోని సుల్తాన్ నగర్‌లో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో గంగాధర్ లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ముగ్గులు వేయించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి రవిరాథోడ్, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మం, సాయిలు తదితరులున్నారు.

# విద్యార్థుల క్షేత్ర పర్యటన


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గాంధీ

**ఎల్లారెడ్డి:** క్షేత్ర పర్యటనలతో విద్యార్థులలో మానసిక వికాసం పెంపొందుతుందని పీఎం శ్రీమోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తోట గాంధీ అన్నారు. గురువారం స్కూల్ విద్యార్థులు రుద్రూర్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలు హరీష్, కృష్ణప్రసాద్‌లు విద్యార్థులకు పంటలు సాగు చేసే విధానం, భూముల సారవంతం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. మొక్కలను అంటు కట్టే విధానం, సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యారమణ, బల్వంత్‌రావు తదితరులున్నారు.

**మెట్ల బావిని సందర్శించిన విద్యార్థులు**

**లింగంపేట/కామారెడ్డి రూరల్:** మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని గురువారం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ)లో భాగంగా నాగన్నగారి మెట్ల బావిని, మెదక్ చర్చి, ఏడుపాయల దుర్గా భవాని ఆలయాలను సందర్శించినట్లు తెలిపారు. నాగన్నగారి బావి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


లింగంపేట మెట్ల బావిని సందర్శించిన విద్యార్థులు

## 'మార్కెట్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించాలి'

**కామారెడ్డి అర్బన్:** ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులందరికి 010 పద్దు కింద రెగ్యులర్ ప్రాతిపదికన పెన్షన్లు చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారుడు జి.లచ్చయ్య, మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బన్సీలాల్ అన్నారు. గురువారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ విశ్రాంత ఉద్యోగుల వివిధ సమస్యలపై చర్చించారు. హెల్త్‌కార్డుల జారీ, బకాయిల విడుదల, లైఫ్ సర్టిఫికెట్ల వ్యవస్థను మీసేవలో అప్‌డేట్ చేయడం, నిలిచిపోయిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం, పీఆర్‌సీ, డీఏ సమస్యలపై తీర్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.విజయ రామరాజు, కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, ప్రతినిధులు రవీందర్, సత్యనారాయణ, కే.వేణుగోపాల్, ఉమ్మడి జిల్లాలోని దాదాపు 40 మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బన్సీలాల్

## గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి


సదాశివనగర్‌లో మాట్లాడుతున్న ఏపీఎం రాజిరెడ్డి

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రాజిరెడ్డి మాట్లాడుతూ...అన్ని గ్రామాల్లో గ్రామ సంఘాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం గ్రామ అధ్యక్షులపై ఉందన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. అలాగే ధర్మారావ్‌పేట్, అమర్లబండ గ్రామాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ద్వారా నిర్వహించడానికి కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు.కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సీసీలు రాములు, లింగం, నరేందర్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ సభ్యులకు టైలరింగ్‌పై శిక్షణ

**రాజంపేట:** మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం మహిళా సంఘ సభ్యులకు టైలరింగ్ , స్టిచ్చింగ్, కటింగ్‌లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏపీఎం సాయిలు తెలిపారు. రాజంపేట మహిళా సంఘ సభ్యులు పద్మ, విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లక్ష్మి, సీసీలు, వివిధ గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పంచాయతీ సెక్రెటరీల నూతన కార్యవర్గం ఎన్నిక

**రాజంపేట :** రాజంపేట మండల పంచాయతీ సెక్రెటరీల నూతన కార్యకవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్. రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.స్వాతి, జనరల్ సెక్రెటరీగా టి. వంశీ, కోశాధికారిగా జె. వసంతలు ఎన్నికయ్యారు.

# అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు

**తహసీల్దార్ శ్రీనివాస్‌రావు**


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** అనుమతులు లేకుండా ఇసుకు తరలిస్తే ఊరుకునేదిలేదని తహశీల్దార్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గ్రామశివారులోని మంజీరనది నుంచి ఇసుక తరలించే విషయమై నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం గోలిలింగాల శివారులోని 20ట్రాక్టర్ల ద్వారా 40ట్రిప్పుల ఇసుకను తరలించాలని అనుమతులిస్తే సుమారు 40ట్రాక్టర్ల ద్వారా 80కిపైగా ట్రిప్పుల ఇసుకను ఎందుకు తరలించారని ఆయన ప్రశ్నించారు. సీసీ రోడ్ల ఏర్పాటు కోసం ఇసుకను తరలించేందుకు తాము అనుమతులిస్తే కొందరు మండలకేంద్రంలో విచ్చలవిడిగా అమ్ముకున్నారని, మరోసారి ఇలా జరిగితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇసుకను అక్రమంగా రవాణాచేస్తే ట్రాక్టర్ యాజమానులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా ఇళ్లు కట్టుకుంటే పంచాయతీ కార్యదర్శి ద్వారా ధృవీకరణ పత్రంతో తమకు దరఖాస్తు చేసుకుంటే మంజీరనది నుండి ఇసుకను తరలించుకునేందుకు అనుమతులు ఇస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఐ మహ్మద్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు తదితరులున్నారు.

**రేషన్ కార్డుల విచారణ పకడ్బందీగా చేపట్టాలి**

**రాజంపేట :** రేషన్ కార్డుల విచారణను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ సతీష్‌రెడ్డి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నూతన రేషన్ కార్డుల మంజూరు, సవరణలపై పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, మండల ప్రత్యేక అధికారి అపర్ణలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్‌లో చేరి సేవకు ముందుకు రావాలి


విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసిన నరసింహాగౌడ్

**భిక్కనూరు:** విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజ సేవకు ముందుకురావాలని ఎన్ఎస్ఎస్ రాష్ట్రఅధికారి నరసింహా గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన ఎయిడ్స్ సుఖవ్యాధుల అవగాహన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నివారణ తప్ప మందులేని ఎయిడ్స్‌తో పాటు సుఖవ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులదేన్నారు. తెలంగాణ యునివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లైంగిక విద్యపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపన్యాస వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు, ప్రశాంస ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, సౌత్‌క్యాంపస్ ఎన్ఎస్ఎస్ అధికారి అంజయ్య, అధ్యాపకులు లలిత, వీరభద్రం, నర్సయ్య,కనకయ్య సురేష్‌లు పాల్గొన్నారు.

## ఏ పెళ్లికి వెళ్లినా స్టీల్ ప్లేట్‌లోనే భోజనం

**మద్నూర్(జుక్కల్) :** ఎక్కడ ఏపెళ్లికి వెళ్లినా స్టీల్ ప్లేట్‌లోనే భోజనం చేస్తానని మద్నూర్‌కు చెందిన తమ్మెవార్ అరవింద్ పేర్కొన్నాడు. మండలకేంద్రంలో గురువారం జరిగిన ఓ పెళ్లిలో స్టీల్ ప్లేట్‌లో భోజనం చేశాడు. సంవత్సరం నుంచి ఏ ఫంక్షన్‌కు వెళ్లినా ఇంటి నుంచి స్టీల్ ప్లేటు తీసుకువెళ్తానని, తనతో పాటు తన భార్య కూడా స్టీల్ ప్లేట్‌లోనే భోజనం చేస్తుందని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా ప్లాస్టిక్ విస్తరాకులు, గ్లాసులు ఉపయోగించమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు త్వరలో వెయ్యి స్టీల్ ప్లేట్లు కొనుగోలు చేసి మద్నూర్‌లో ఏ ఫంక్షన్ జరిగిన పంపిణీ చేస్తానని వెల్లడించారు.


స్టీల్ ప్లేట్‌లో అన్నం తింటున్న అరవింద్

### ఎండిన వరి పైరు

**మాచారెడ్డి :** భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన మాలోత్ మోహన్ అనే రైతు తనకున్న రెండెకరాల పొలంలో నాటు వేశాడు. పదిహేను రోజుల నుంచి వ్యవసాయ బావిలో నీరు ఇంకిపోవడంతో సగం వరకు ఎండిపోయిందని వాపోయాడు.అదే గ్రామానికి చెందిన మాలోత్ కిష్ట్యా రెండు బోరు బావులు తవ్వించి రెండెకరాలు సాగు చేశాడు. బోరుబావి వట్టిపోవడంతో సగం పొలం ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.


ఎల్లంపేటలో ఎండిన వరిపైరు

### మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**నవీపేట:** మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి బుధవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

### ముగ్గురు వడ్డీ వ్యాపారులపై కేసులు

**బిచ్కుంద(జుక్కల్):** మండల కేంద్రంలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. భూములు, ఇతర పత్రాలు, ప్రామిసరినోట్స్ రాసుకొని రెట్టింపు వడ్డీ వసూలుకు పాల్పడుతున్నారని పక్కా సమాచారం రావడంతో ముగ్గురి ఇళ్లలో సోదాలు చేశామని సీఐ నరేష్ తెలిపారు. శ్రీరామ్ వీర్‌కుమార్, పడిగెల లక్ష్మణ్, ఎన్నెంవార్ అశోక్ ఇళ్లలో అధిక వడ్డీ కింద రాసుకున్న పత్రాలు లభ్యం అయ్యాయన్నారు. దీంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### మట్కా ఆడుతున్న ఇద్దరి అరెస్టు

**ఆర్మూర్‌టౌన్:** పెర్కిట్‌లో మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ గురువారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో మట్కా స్థావరంపై దాడి చేసి మట్కా ఆడుతున్న అగల్ దివిటి సత్యనారాయణ, దండవుల పెద్ద వెంకటి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.పదివేల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



## క్రైం కార్నర్

### చికిత్స పొందుతూ ఒకరి మృతి


కొత్తరాములు మృతదేహం


**ఖలీల్‌వాడి:** ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని వివేకానందనగర్‌కు చెందిన కొత్తరాములు(50) రైస్‌మిల్‌లో పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 24న అతడు కల్లులో గడ్డి మందు కలుపుకొని తాగి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో వాంతులు చేసుకోగా కుటుంబసభ్యులు విషయం చెప్పడంతో వారు అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం రాత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### గుర్తుతెలియని వ్యక్తి..



**బాల్కొండ:** రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులోగల పాత జాతీయ రహదారి 44పై మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి కాలినడకన వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, మృతుడి వివరాలు ఇప్పటి వరకు తెలియరాలేవని బాల్కొండ ఎస్సై నరేశ్ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

### అధికారి వేధింపులు భరించలేక అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సువర్ణ

**నస్రుల్లాబాద్(బాన్సువాడ):** మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సువర్ణ ఉన్నతాధికారి వేధింపులు భరించలేక గురువారం ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలు మాట్లాడుతూ.. సంబంధిత ఉన్నతాధికారి ఇంటి పనులు చేయిస్తూ ఆమెకు మామూళ్లు ఇవ్వకపోతే తప్పులు తీస్తూ వేధిస్తుండడంతో ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. స్థానికులు గమనించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

### కంకర లారీ బోల్తా

**రుద్రూర్:** పోతంగల్ మండలం హంగర్గా ఆబాదిలో గురువారం కంకర లారీ బోల్తా పడింది. సీసీ పనుల కోసం కంకర లోడ్‌తో వచ్చిన లారీ ఖాళీ చేసేందుకు రివర్స్ తీసుకునే క్రమంలో బోల్తా పడినట్టు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదని వారు పేర్కొన్నారు.

### ఒడ్డెటమ్మ ఆలయంలో చోరీ

**మాక్లూర్:** మండలంలోని ఒడ్డెటమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఆలయకమిటీ చైర్మన్ మీసాల రవి గురువారం తెలిపారు. ఆలయంలోకి బుధవారం రాత్రి దుండుగులు చొరబడి హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.10వేలను అపహరించినట్లు తెలిపారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రవి తెలిపారు.

### అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోటి టోకరా

**ఖలీల్‌వాడి:** నగరంలోని పూసలగల్లీకి చెందిన ఓ బీజేపీ నాయకురాలు పలువురికి అధిక వడ్డీ ఆశ చూపి రూ. కోటి టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, ఇతరుల వద్ద అధిక వడ్డీ ఆశ చూపి సదరు నాయకురాలు డబ్బులు తీసుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినా వారు పట్టించుకోకపోవడంతో బాధితులు అర్బన్ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో రఘుపతిని వివరణ కోరగా బీజేపీ మహిళ నేతపై ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టినట్లు తెలిపారు.

### డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

**నందిపేట్ (ఆర్మూర్):** నందిపేట్‌లోని వివేకానంద చౌరస్తా వద్ద ఇటీవల పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించగా పిట్ల గణేష్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో అతడిని పోలీసులు గురువారం ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌లో హాజరుపర్చారు. అనంతరం జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

### ఇందల్వాయి మండలంలో..

**ఇందల్వాయి:** మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు గురువారం అతడిని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చారు. అనంతరం జడ్జి అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

## సంక్షిప్తం

**విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ**

**పిట్లం(జుక్కల్):** మండలంలోని రాంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కరూర్ వైశ్య బ్యాంక్ నిజామాబాద్ బ్రాంచ్ సహకారంతో స్వప్నిక రేహా ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హైజీన్ కిట్స్, ఆట వస్తువుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వప్నిక రేహా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడారు. కరూర్ వైశ్య బ్యాంక్ మేనేజర్ రాధాకృష్ణ, స్వప్నిక రెహా ఫౌండేషన్ అడ్వకేట్, ఫౌండర్ మహాలక్ష్మి, లీగల్ మేనేజర్ మణికంఠ, మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ప్లేట్లు..**

**ఎల్లారెడ్డిరూరల్:** మున్సిపాలిటి పరిధిలోని లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన నర్ల రాజు అనే వ్యక్తి గురువారం ప్లేట్లు పంపిణీ చేశారు. రాజు తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు అందించారు.

**దేశాయిపేట్ వైస్ చైర్మన్ కుటుంబానికి పరామర్శ**

**బాన్సువాడ రూరల్:** మండలంలోని దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందగా గురువారం ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్, దేశాయిపేట్ సొసైటీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంబర్ సింగ్ కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

## చోరీ కేసులో ఒకరి రిమాండ్

**లింగంపేట(ఎల్లారెడ్డి):** చోరీ కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ తెలిపా రు. లింగంపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయ న వివరాలు వెల్లడించారు. మండలంలోని కన్నాపూ ర్ గ్రామానికి చెందిన గ్యారవోయిన శ్రీకాంత్ అనే వ్యక్తి ఈ నెల 19న నల్లమడుగు గ్రామానికి చెందిన ఎట్టెం సిద్దయ్య ఇంట్లో కూలీ పనికి వచ్చి రాత్రివేళ చోరీకి పాల్పడ్డాడు. రూ.2.30లక్షల నగదు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, అలాగే పరి చయస్తుడి బైక్ చోరీ చేసి పారిపోయాడు. బాధితుడు సిద్దయ్య ఫి ర్యాదు మేరకు ఏఎస్సై ప్రకాష్‌నాయక్ కేసు నమో దు చేసుకొని దర్యాప్తు ప్రారంభించాడు. ఈక్రమంలో గురువారం పొల్కంపేట చౌరస్తాలో నిందితుడు శ్రీకాంత్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ. 17వేల నగదు, ఒక జత వెండి పట్ట గొ లుసు, వెండి బ్రాస్‌లెట్, మూడు వెండి ఉంగరాలు, సెల్‌ఫోన్ రికవరీ చేసినట్లు తెలిపారు.

నిందితుడిపై కీసర, లింగంపేట, రామాయంపేట, సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. 2024 ఆగస్టులో ఓ మర్డర్ కేసులో రిమాండ్‌కు తరలించగా, ఈ మధ్యనే సంగారెడ్డి జైలు నుంచి విడుదలై తిరిగి నేరాలకు పాల్పడుతున్నాడన్నారు. చోరీ కేసును వారం రోజుల్లో ఛేదించిన ఏఎస్సై ప్రకాష్‌నాయక్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

## గంజాయి మొక్కలు, సారా పట్టివేత


జెమినీ తండాలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

**గాంధారి(ఎల్లారెడ్డి):** మండల పరిధిలోని జెమినీ తండాలో గురువారం నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో దాడులు చేశారు. తండాకు చెందిన హనుమా అనే వ్యక్తి గంజాయి మొక్కలు పెంచుతున్నారనే పక్కా సమాచారం రావడంతో దాడి చేసినట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపారు. ఆయన పెంచుతున్న 10 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని హనుమాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అదే తండాలో రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, బెల్లం పానకాన్ని పారబోసినట్లు తెలిపారు.